క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకులకు పరామర్శ



పాపయ్యను పరామర్శిస్తున్న కంబాల, చిక్కాల

పాయకరావుపేట: మండలంలోని అరట్లకోటలో మాజీ ఉప సర్పంచ్ తూము శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకుడు తిపరాల పాపయ్యలను వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ చిక్కాల రామారావు పరామర్శించారు. ఇటీవల వీరిరువురు సర్జరీలు చేయించుకున్న కారణంగా వారి స్వగృహానికి వెళ్లి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పరామర్శలో సీనియర్ నాయకులు ధనిశెట్టి బాబూరావు, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా, ఉప సర్పంచ్ జగతా భవానీశ్రీనివాస్, సర్పంచ్‌లు పన్నీరు పాపారావు, గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, గ్రామ నాయకులు తూము రాజుబాబు, పెపకాయల అపాపరావు తదితరులు ఉన్నారు.

గంగాలమ్మ గుడికి విరాళం



విరాళం అందజేస్తున్న భక్తుడు మూర్తి

మునగపాక: మండలంలోని పాటిపల్లి–మంగళవరపుపేట గ్రామాల పరిధిలో గంగాలమ్మ తల్లి గుడి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ గుడి నిర్మాణానికి పలువురు భక్తులు తమ వంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం పాటిపల్లికి చెందిన పాలిశెట్టి త్రిమూర్తులు, మహలక్ష్మి దంపతుల కుమారుడు పీజీఎస్ఎన్ మూర్తి రూ.10,116 విరాళం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, అట్టలు పంపిణీ చేసిన ట్రస్ట్ సభ్యులు

పాయకరావుపేట: మండలంలో రత్నయ్యమ్మపేటలో ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులకు, కుమారపురం యూపీ స్కూల్ విద్యార్థులకు గురు పౌర్ణమి సందర్భంగా దానధర్మం చారిటబుల్ ట్రస్ట్, సనాతన ధర్మమేథో వేదిక ఆర్థిక సాయంతో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. 1, 2 తరగతులకు పలకలు, 3, 4, 5 తరగతులకు నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, 6, 7, 8 తరగతులకు అట్టలు అందజేశారు. మొత్తం 113 మంది విద్యార్థులకు వీటిని అందజేసినట్టు ట్రస్ట్ సభ్యులు వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కుమారుడు పెరుమాళ్ల రామకృష్ణ, చవ్వాకుల వరహాలరావు, కాలపరెడ్డి దేవతరెడ్డి, రావాడ ప్రసాద్‌రెడ్డి, గురుబిల్లి నాగిరెడ్డి, దిగుమర్తి శ్రీను పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ మేళా ఏర్పాట్ల పరిశీలన



మేళా ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు

నర్సీపట్నం: పెదబొడ్డేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం జరగనున్న వ్యవసాయ యాంత్రీకరణ మేళా ఏర్పాట్లను మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణతో కలిసి జిల్లా వ్యవసాయశాఖ అధికారి మోహన్‌రావు పరిశీలించారు. వ్యవసాయ యంత్రాల ఆవశ్యకతను రైతుల్లోకి తీసుకువెళ్లేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నామని మోహన్‌రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ టి.శ్రీదేవి, ఏవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేల కూలిన భారీ వృక్షం

అనకాపల్లి: ఇటీవల వర్షాలకు స్థానిక 82వ వార్డు నర్సింగరావుపేట, జీవీ కోటేశ్వరరావు వీధిలో గురువారం ఉదయం భారీ వృక్షం అకస్మాత్తుగా నేల కూలడంతో కారు దెబ్బతింది. ఈ విషయం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు జానకీరామరాజు, విద్యుత్ ఉద్యోగులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కారుపై పడిన చెట్టును క్రేన్ సహాయంతో తొలగించారు. తెగిపడిన విద్యుత్ వైర్లను ఆ శాఖ అధికారులు తమ సిబ్బందితో మరమ్మతులు చేపట్టారు. జోనల్ అధికారులు రహదారిపై చెట్టుకొమ్మలను తరలించారు. స్థానికులకు విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా పునరుద్ధరించారు. జీవీఎంసీ సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించి కారుకు నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేస్తానని యజమాని రఘువర్మకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు.

ఖరీఫ్ సాగుకు సిద్ధం



తిమ్మరాజుపేటలో వరి ఆకుమడి

ఈ ఏడాది వరి సాగు పెరుగుతుందని అంచనా
దుక్కులు, ఆకుమడులు వేసే పనిలో అన్నదాతలు
చెరకు సాగులో తెగుళ్ల బెడద



వాడ్రాపల్లిలో వరిసాగుకు సిద్ధం చేసిన భూమి

మునగపాక: వాతావరణం అనుకూలంగా ఉండడంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతున్నారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వరి సాగుకు అవసరమయ్యే సన్నాహాలు చేస్తున్నారు. వర్షాలు అడపా దడపా కురుస్తుండడంతో పలు చోట్ల దుక్కులు చేస్తున్నారు. మరికొన్ని చోట్ల రైతులు వరి ఆకుమడులు వేసే పనిలో ఉన్నారు. వరిలో అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ మెరుగైన దిగుబడులు సాధించే దిశగా తమవంతు కృషి చేస్తున్నారు.

పెరగనున్న వరి సాగు విస్తీర్ణం...

మండల వ్యాప్తంగా ఈ ఏడాది వరి సాగు పెరిగే అవకాశం కనిపిస్తుంది. ఖరీఫ్ సాగు విస్తీర్ణం 3,897 హెక్టార్లుగా ఉంది. చెరకుకు సంబంధించి 1063 హెక్టార్లు, ఇతర పంటలు 1153 హెక్టార్ల మేర సాగు చేస్తున్నారు. వరి విషయానికి వస్తే రైతులు గతంలో కన్నా ఈ ఏడాది సాగు పెంచే పరిస్థితులు కనిపిస్తున్నాయి. చెరకు తోటలకు తరచూ తెగుళ్ల బెడద ఉన్నందున దిగుబడులు తగ్గిపోవడం దీనికి తోడు ఆదాయం రాకపోవడంతో రైతులు వరిసాగుపై మక్కువ చూపుతున్నారు. ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 1,456 హెక్టార్లు. అయితే ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఒకవైపు దుక్కులు... మరోవైపు ఆకుమడులు

మండల వ్యాప్తంగా రైతులు వరిసాగుకు అవసరమయ్యే చర్యలు వేగవంతం చేస్తున్నారు. సీజన్‌లో రైతులు వరి సాగు కోసం తమ భూములను దుక్కులు చేయడంతోపాటు ఆకుమడులు వేసే పనిలో బిజీగా గడుపుతున్నారు. పశువుల గెత్తంతో పాటు పచ్చిరొట్ట విత్తనాలను భూమిలో కలియదున్నడం ద్వారా వరిలో మెరుగైన దిగుబడులు సాధించేందుకు రైతులు ఉపక్రమిస్తున్నారు. పలు గ్రామాల్లో ఇప్పటికే భూములను వరి సాగు చేపట్టేందుకు అవసరమయ్యే చర్యలు పూర్తి చేశారు. మరికొన్ని చోట్ల సాగునీటి కాలువల ద్వారా వచ్చే నీటి ఆధారంగా సాగు చేపట్టే పనిలో నిమగ్నమై ఉన్నారు.

అందుబాటులో ఎరువులు, విత్తనాలు..

మండల వ్యాప్తంగా రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచడంతో రైతులు సంబంధిత పనులు చేపడుతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులను కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే రైతుల డిమాండ్ మేరకు వరి విత్తనాలను రాయితీపై సరఫరా చేయగా ఎరువులను అందుబాటులోకి తీసుకువచ్చారు. దీంతో రైతులు ఎరువులను అవసరం మేరకు కొనుగోలు చేసుకుంటున్నారు.

ఎరువుల వినియోగంలో జాగ్రత్తలు



ఖరీఫ్‌లో ఈ ఏడాది వరి సాగు పెరుగుతుందని ఆశిస్తున్నాం. గతంలో చెరకు సాగు ఎక్కువగా ఉండేది. తెగుళ్ల కారణంగా రైతులు చెరకు సాగు తగ్గించేసి వరి సాగుపై దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే వరి విత్తనాలను సరఫరా చేశాం. ఎరువులను అందుబాటులోకి తీసుకువచ్చాం. ఎరువుల వినియోగంలో స్థానిక అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. మోతాదుకు మించి ఎరువులను వినియోగిస్తే నష్టాలు చవి చూడాల్సి వస్తుంది.

– సీహెచ్.జ్యోత్స్నకుమారి, ఏవో, మునగపాక

స్మార్ట్ మీటర్లను రద్దు చేయకుంటే ఆందోళన



పోస్టర్లు ప్రదర్శిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ,రైతులు

మునగపాక: ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం విస్మరిస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ విమర్శించారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయడం తగదని నిరసిస్తూ గురువారం వెంకటాపురంలో రైతులతో కలిసి ఆయన ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కారణంగా ప్రతీ రైతుకు రూ.20 నుంచి రూ.22 వేల వరకు విద్యుత్ బిల్లులు రావడం అన్యాయమన్నారు. వెంటనే స్మార్ట్ మీటర్లను తొలగించాలన్నారు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే స్మార్ట్ మీటర్లను రద్దు చేస్తామంటూ మంత్రి లోకేష్ ఇచ్చిన హామీ బుట్టదాఖలైందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్మార్ట్ మీటర్లను తొలగించాలని లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో రైతులతో కలిసి భారీ ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు నక్కరాజు సత్యారావు, పందూరి, నూకరాజు, కడియం దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్‌కు టేబుల్ టెన్నిస్ బోర్డు వితరణ



టేబుల్ టెన్నిస్ బోర్డును ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక: విద్యాభివృద్ధికి ఎన్ఆర్ఐ పురోగామి అందిస్తున్న సేవలు అభినందనీయమని హెచ్ఎం రామలక్ష్మి తెలిపారు. తోటాడ హైస్కూల్‌కు బుద్ధ పశుపతి జ్ఞాపకార్థంగా యూఎస్‌లో ఉంటున్న అతని కుమారుడు పురోగామి ఉగాది ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేల విలువ చేసే టేబుల్ టెన్నిస్ బోర్డును వితరణగా అందజేశారు. ఈ బోర్డును హెచ్ఎం రామలక్ష్మి గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఉగాది ఫౌండేషన్ ద్వారా విద్యాభివృద్ధికి అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఏటా పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించే ఐదుగురు విద్యార్థులకు ఆయన రూ.50 వేల మేర ప్రోత్సాహకాలు అందిస్తున్నారన్నారు. ఇటువంటి దాతలను ఆదర్శంగా తీసుకొని హైస్కూల్ అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కోటవురట్ల: నర్సీపట్నం మండలం బలిఘట్టం నుంచి కోటవురట్లకు వచ్చే 33 కె.వి లైన్‌లో శుక్రవారం చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మూడు సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

అచ్యుతాపురం: మండలంలోని కొండకర్ల సబ్ స్టేషన్ పరిధిలోని పెదపాడు ఫీడర్ దిగువకు వచ్చే ప్రాంతాల్లో ఈ నెల 12వ తేదీన విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కే రాజశేఖర్ తెలిపారు. ఆరోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ హరిపాలెం, అందలాపల్లి, తిమ్మరాజుపేట, పెదపాడు, ఖాజీపాలెం, జగ్గన్నపేట పరిధిలో సరఫరాకు ఉండబోదని తెలిపారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్



పింద్రంగిలో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు, డ్వామా పీడీ పూర్ణిమాదేవి



కోటవురట్లలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ ఉమాదేవి



పెదగుమ్ములూరు పాఠశాలలో కోలాటం చేస్తున్న విద్యార్థులు

మునగపాక: విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా గురువారం పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. దీనిలో భాగంగా పాటిపల్లి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ పిల్లల చదువులపై తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. మౌలిక సదుపాయాలు పూర్తి స్థాయిలో కల్పించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో ఉషారాణి, ఇన్‌చార్జి తహసీల్దార్ మురళీధర్, స్కూల్ కమిటీ చైర్మన్ జోగినాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలి

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడం వల్ల విద్యార్థులకు మంచి విద్యాబోధన అందుతుందని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. పింద్రంగిలోని పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి, కొప్పుల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రొంగలి మహేష్, ఎంపీడీవో సాంబశివరావు, ఎంఈవోలు సత్యనారాయణ, డీవీడీ.ప్రసాద్ పాల్గొన్నారు. గుల్లేపల్లి ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎం ఎస్.వీరాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన పీటీఎంలో సర్పంచ్ బండారు దేముళ్లు, ఎంపీటీసీ కొరెడ్డి దేముడుబాబు, పీఎంసీ కమిటీ చైర్మన్ బి.మహాలక్ష్మి, ఉపాధ్యాయురాలు నీలిమ పాల్గొన్నారు.

యలమంచిలి రూరల్: పట్టణం, మండలంలోని విద్యా సంస్థల్లో గురువారం మెగా పీటీఎం 2.0 పేరుతో నిర్వహించిన ఆత్మీయ సమావేశాలు ఉల్లాసంగా సాగాయి. యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెగా పీటీఎంకు ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, ఆర్అండ్‌బీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో బాలికలు తల్లులకు పాదపూజ చేశారు. ఇక్కడ విద్యార్థినుల సంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు బంగారు బాట వేసింది జగనన్నే..

కోటవురట్ల: మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తయారు చేశారని, ఆ ఫలాలే ఇపుడు విద్యార్థులకు అందుతున్నాయని జెడ్పీటీసీ సభ్యురాలు సిద్దాబత్తుల ఉమాదేవి అన్నారు. మండలంలో అన్ని విద్యా సంస్థల్లో గురువారం మెగా పేరెంట్ మీటింగ్ నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం సుకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వంలో విద్యకు మొదటి ప్రాధాన్యమిచ్చి విద్యా వ్యవస్థను గాడిలో పెట్టారన్నారు. జగనన్న విద్యార్థులకు ఓ మేనమామలా అండగా ఉంటూ మేలు చేశారన్నారు. మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోనే తమ జీవితాలను ఉజ్వలంగా మార్చుకోవాలన్నారు. ఎంఈవో శోభారాణి, ఎంపీడీవో చంద్రశేఖర్, తహసీల్దారు తిరుమల బాబు, ఎంఈవో రామారావు, ఈవోపీఆర్డీ రఘురాం, వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్దాబత్తుల సత్యనారాయణ సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ పుద్రేవు వెంకట సూర్యారావు, టీడీపీ నాయకుడు జానకి శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. జల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం శ్రీనివాసమూర్తి అధ్యక్షతన పీటీఎం జరగగా, సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇక్కడ టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు, సర్పంచ్ పద్మావతి, వైఎస్సార్ సీపీ నాయకుడు విజయకుమార్, మాజీ సర్పంచ్ హైమావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పెదఉప్పలం పాఠశాలలో మొక్క నాటుతున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

పాయకరావుపేట: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశానికి ఎంపీడీవో ఎ.జయప్రకాష్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేసి, వాటిని పెంచే విధానంపై అవగాహన కల్పించారు. సత్యవరం పాఠశాల విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేసారు. విద్యార్థులను తల్లిదండ్రులు దీవించారు. మంగవరంలో ఈవోఆర్డీ డేవిడ్ ప్రసంగించి, విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు అందించారు.

ఎస్.రాయవరం: మండలంలో పలు పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. కోలాటం, ముగ్గులు పోటీలు నిర్వహించారు. పెదఉప్పలంలో డిప్యూటీ డీఈవో అప్పారావు పాల్గొని, పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. పెదగుమ్ములూరు పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి కోలాటం చేశారు.



యలమంచిలి జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థినులు



జల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థుల నృత్యం



సత్యవరం పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేస్తున్న దృశ్యం



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

పారిశుధ్యం మెరుగుకు సహకరించండి..



లింగాపురంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

కోటవురట్ల: పారిశుధ్య మెరుగుకు అంతా సహకరించాలని ఎంపీడీవో చంద్రశేఖర్ కోరారు. మండంలోని ఐవీఆర్ఎస్ గ్రామాలు బి.కె.పల్లి, యండపల్లి, లింగాపురంలో ఈవోపీఆర్డీ రఘురాంతో కలిసి ఆయన గురువారం పర్యటించారు. పారిశుధ్య కార్మికులతో పాటు ఇంటింటికి వెళ్లి పారిశుధ్యం, ఆరోగ్యం, వ్యాధులపై అవగాహన కల్పించారు. పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి సంపద తయారీ కేంద్రాల అభివృద్ధికి సహకరించాలన్నారు. ఇంటితో పాటు వీధులను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం చెత్త నుంచి సందప తయారీ కేంద్రాలను పరిశీలించి చేపట్టాల్సిన చర్యలపై కార్యదర్శికి ఆదేశాలిచ్చారు.

భక్తిశ్రద్ధలతో ఏకాహ భజన

కశింకోట: స్థానిక గవరపేటలో ఓ ఆశ్రమంలో గురువారం హరి నామస్మరణతో ఏకాహం భజన కార్యక్రమాన్ని చేపట్టారు. ఆషాఢ మాసం వ్యాస పౌర్ణమి పురస్కరించుకొని చేపట్టిన కార్యక్రమం శుక్రవారం ముగియనుందని నిర్వాహకులు తెలిపారు.





ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు



ఉమ్మలాడలో సాయిబాబాను దర్శించుకుంటున్న భక్తులు



మునగపాకలో అన్న సమారాధన నిర్వహిస్తున్న దృశ్యం

మునగపాక: మండల వ్యాప్తంగా గురుపౌర్ణమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి గ్రామాల్లోని సాయిబాబాను దర్శించుకొని పూజలు చేశారు. సాయి నామస్మరణతో గ్రామాలు మార్మోగాయి. మునగపాకలోని వారం రోజులుగా నిర్వహిస్తున్న సప్తాహం కార్యక్రమం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు. తోటాడ ఓంకార పీఠాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సందర్శించి పూజలు చేశారు.

ఎస్.రాయవరం: గురుపౌర్ణమి పురస్కరించుకుని రేవుపోలవరం సాయిబాబా మందిరంలో బాబాకు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా బాబాను దర్శించుకునేందుకు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. తిమ్మాపురం, పెదగుమ్ములూరు, దార్లపూడి, ఎస్.రాయవరం, వేమగిరి తదితర గ్రామాల్లో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీంతో గ్రామాల్లో ప్రత్యేక సందడి నెలకొంది.

అచ్యుతాపురం: మండలంలోని ఎస్ఈజెడ్ కాలనీ దిబ్బపాలెంలో షిర్డీసాయి మందిరంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ గురువారం పూజలు చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు ఆశీర్వచనాలు అందుకున్నారు. స్థానికులు,కూటమి నేతలు పాల్గొన్నారు.



బాబాకు క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

నర్సీపట్నం: బలిఘట్టం పాకలపాడు గురువుగారు ఆశ్రమంలో గురుపౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. నర్సీపట్నం పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వేల మంది భక్తులు రావడంతో గురువుగారు ఆశ్రమంలో సందడి వాతావరణం నెలకొంది. పూజలు అనంతరం భక్తులు గురువుగారిని దర్శించుకున్నారు. అన్నసంతర్పణలో పాల్గొన్న భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. షిర్డీ సాయి మందిరంలో గురుపౌర్ణమి పూజలను ఘనంగా నిర్వహించారు.

బాల వికాస కేంద్రాలతో ప్రయోజనం



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న నిర్వాహకులు

యలమంచిలి రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా తిరుమల తిరుపతి దేవస్థానం, సమరసత ఫౌండేషన్ సంయుక్తంగా నెలకొల్పుతున్న బాల వికాస కేంద్రాలతో బాలలకు ఎంతో ప్రయోజనమని సమరసత ఫౌండేషన్ ఉత్తరాంధ్ర జోనల్ ధర్మ ప్రచారక్ ఆడారి గంగాధర్ అభిప్రాయపడ్డారు. గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురువారం రాత్రి పట్టణంలో అయోధ్యపురి కాలనీలో కొత్తగా నిర్మించిన రామాలయంలో బాలవికాస కేంద్రాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. బాల వికాస కేంద్రాల ద్వారా బాల్యం నుంచే బాలల్లో సంస్కారంతో కూడిన చదువు, నడవడిక అలవడతాయన్నారు. రోజూ సాయంత్రం రెండు గంటల పాటు ఆటపాటలు, హోంవర్కులు చేయించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ఆటల సామగ్రి, కర్రి ధనరెడ్డి ఆర్థిక సహాయంతో సమకూర్చిన బ్యాగులను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. సమరసత ఫౌండేషన్ మండల కన్వీనర్ శివకోటి సతీష్, అర్చకులు కనకరాజు, జిల్లా ధర్మ ప్రచారక్ మైలపల్లి శ్రీను, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు పనులు చేస్తేనే అవార్డు

నాతవరం: నిబంధనలు అనుసరించి అభివృద్ధి పనులు చేసే పంచాయతీలకు జాతీయ రాష్ట్ర స్థాయిలో అవార్డుల కోసం ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కోఆర్డినేటరు బత్తుల రమేష్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గరువారం పంచాయతీలో పని చేసే అన్నిశాఖల అధికారులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా వచ్చిన నిబంధనలు ప్రకారం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సకాలంలో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు అందించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గతంలో అవార్డుల ఎంపిక విషయంలో పలు లోపాలు జరిగేవని, వాటిని నివారించేందుకు శిక్షణ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ ఎం.ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

